# 1

# అతని కాలానికి దేవుని మనిషి

## (1 రాజులు 19:14-21; 2 రాజులు 2:1-18)

ఏలీయా పరిచర్య ప్రత్యేక రీతిగా యుండెడిది. అతని ప్రయత్నంవల్లనే ఉత్తర రాజ్యంలో బయలు భక్తి అంతరించిపోయింది. అహాబు కుమారుడైన యెహోరాము పరిపాలనకు వచ్చినప్పుడు "తన తండ్రి నిలిపిన బయలుదేవతా స్తంభమును తీసివేసెను గాని యెహోవా దృష్టికి చెడుతనము చేయుట మానకుండెను" (2 రాజులు 3:2బి). అయినప్పటికి యెజెబెలు బ్రతికున్నంతవరకు బయలు ఆరాధనలు కొనసాగాయి (1 రాజులు 16:31; 2 రాజులు 10:18-28 చూడు). దానికితోడు యితర దుష్ట వ్యవహారాలుతోడైనవి, యరొబాము యొక్క ప్రోత్సాహంవల్ల విగ్రహారాధన విస్తరించింది (2 రాజులు 3:3). అవన్ని కష్ట కాలాలే. ఇశ్రాయేలులో దేవునికి తన మనిషి అనేవాడు తప్పక కావలసియున్నది.

ఆనాటికి ఎలీషా దేవుడేర్పరచుకొనిన దేవుని మనిషి. ఏలీయాకున్నంత పేరు గుర్తింపు ఇతనికి ఉండకపోవచ్చునేమోగాని, అప్పటికి ఇతడొక గొప్ప వ్యక్తి అని చెప్పాలి. రాజులు రెండవ గ్రంథం చూచినట్టయితే దాంట్లో ఎలీషా కథానాయకుడు. దీంట్లో అతని జీవితం గురించే ఉందిగాని రాజుల వృత్తాంతాలు మాత్రం వివరించబడలేదు.

ఎలీషా యొక్క వృత్తి వివరాలు, దాదాపు ఇరవై సంఘటనలు బైబిల్లో నమోదు చేయబడినవి. అతడు ప్రవక్తగా పిలుపునందుకున్నప్పటినుండి మన ఈ పఠనం ప్రారంభమవుతుంది.

### దేవుడేర్పరచుకొన్న మనిషి (1 రాజులు 19:14-21)

#### ఫిర్యాదులు ప్రత్యుత్తరాలు

1 రాజులు 19వ అధ్యాయంలో ఎలీషా గురించి మొట్టమొదటిగా చదువుచున్నాము. నిరుత్సాహపడిన ఏలీయా హోరేబు పర్వతంలోని ఒక గుహలో ఎంతో గందరగోళ పరిస్థితిలో దాగియున్నాడు. కర్మెలు పర్వతం మీద బయలు ప్రవక్తలను ఓడించాడు, అయినప్పటికి ఇశ్రాయేలులో ఎలాంటి మార్పు లేకపోవుట అతడు చూస్తున్నాడు. అతడు ప్రభువుకు నాలుగు ఫిర్యాదులు చేశాడు:

> ఇశ్రాయేలువారు నీ నిబంధనను త్రోసివేసి నీ బలిపీఠములను పడగొట్టి నీ ప్రవక్తలను ఖడ్గముచేత హతముచేసిరి. సైన్యములకధిపతియు దేవుడునగు యెహోవా కొరకు మహా రోషముగలవాడనై నేను ఒకడను మాత్రమే మిగిలియుండగా వారు నా ప్రాణము తీసివేయుటకై చూచుచున్నారని చెప్పెను (14 వచనం).

ఏలీయా ఫిర్యాదులకు యెహోవా ఒక్కొక్కటిగా జవాబిచ్చాడు. "ఇశ్రాయేలువారు నీ నిబంధన త్రోసివేశారు" అని మొదటి ఫిర్యాదు చేశాడు. అందుకు దేవుడు, "ఆరాము రాజైన హజాయేలుకు పట్టాభిషేకం చేయుము" (15 వచనం) అని జవాబిచ్చాడు.

ఏలీయా రెండవ ఫిర్యాదు ఏమంటే, “యెహోవా బలిపీఠము పడగొట్టబడినది.” ఇలాంటి దుష్టకార్యం చేయడానికి ప్రోత్సహించి ప్రోద్బలం చేసినవారు అహాబు, యెజెబెలులే. ఏలీయా చేసిన ఈ ఫిర్యాదుకు దేవుడిచ్చిన ప్రత్యుత్తరమేమంటే నీవు వెళ్ళి ఇశ్రాయేలీయుల మీద యెహూను రాజుగా పట్టాభిషేకం చేయుము (16ఎ వచనం). యెహూ అహాబువంశాన్ని నాశనం చేయును గాక మరియు బయలు ఆరాధనలను బొత్తిగా తుడిచి వేయగలడు.

ఏలీయా చేసిన మూడవ ఫిర్యాదు “ఇశ్రాయేలువారు [దేవుని] ప్రవక్తలను ఖడ్గముతో హతముచేసినారు” (14డి వచనం) అని. దానికి ప్రభువిచ్చిన ప్రత్యుత్తరమేమంటే, “ఆ విషయం నీవేమి ఆలోచించవవద్దు, బాధపడవద్దు. దాని స్థానములో వేరొకటి నేను ఉంచుతాను.” ఆయన ఏలీయాతో “నీకు మారుగా ప్రవక్తయై యుండుటకు ఆబేల్మెహోలావాడైన షాపాతు కుమారుడైన ఎలీషాను అభిషేకము చేయుము” (16బి వచనం).

ఇక్కడ ఏలీయాకు యివ్వబడిన సూచనలు ఎలీషా పిలుపుకు వర్తిస్తాయి. ఏలీయాకు కూడ పాక్షికంగ వర్తిస్తాయి కాబట్టి కొన్ని వ్యాఖ్యానాలు (ఆక్షేపణలు) సిద్ధంగా ఉన్నాయి. యిక్కడ “అభిషేకము లేక పట్టాభిషేకము” అనే మాట ఒక గురుతుగా మాత్రమే వాడబడినది. అభిషేకము అంటే తైలము తలమీద పోయడం ద్వారా జరిగే క్రియ కాని మనకు తెలిసినంతవరకు యెహూ ఒక్కడు మాత్రమే తైలము తలమీద పోయించుకోబడినవాడు అది కూడ ఏలీయా ద్వారా జరగలేదు (2 రాజుల 9:1-6). ఒక్కటి మాత్రం మనసులో నిఖరం చేసుకోండి అదేమంటే, “అభిషేకించడం” అన్నదానికి మూలార్థం, *ఉద్దేశమేమంటే,* “దేవుని సేవకు ప్రత్యేకించబడడం”[1] అని మత్రమే.

పై మూడింటిలోకూడ ఏలీయా వ్యక్తిగతంగా చేయగలిగింది ఎలీషాను దైవసేవార్థమై నియోగించాడు. ఇక మిగతా ఇద్దరిలో, అంటే, హజాయేలు, యెహూ వీరిద్దరి నియామకాలు ఎలీషా మరియు ఎలీషా విద్యార్థి ద్వారా జరిగాయి (2 రాజులు 8:7-15; 9:1-10 చూడు). ఈ క్రింద వివరించబడిన చిత్రము జరిగినదాన్ని వరస క్రమాన్ని వివరిస్తుంది:

ఏలీయా → ఎలీషా (1 రాజులు 19:19-21)

↓

ఎలీషా → హజాయేలు (2 రాజులు 8:7-15)

↓

విద్యార్థి → యెహూ (2 రాజులు 9:1-10)

దైవిక దృక్పథం ప్రకారం చూస్తే యివన్నీ ఏలీయా ఒక్కడే చేశాడు. ఏలీయా యొక్క సేవకుడు (ఎలీషా) హజాయేలును నియమించినప్పుడు అదంతా ఏలీయా నియమించినట్టుగానేయున్నది. ఇదే విధంగా ఎలీషా ఆజ్ఞాపించగా ఎలీషా సేవకుడు యెహూను నియమించాడు, కాని అదికూడ ఎలీషా చేసినట్టుగానేవున్నది. మరలా దీని ఫలితంగా తెలుస్తున్నదేమంటే ఎలీషా ద్వారా ఏలీయా నిర్వహించాడని.

హోరేబు పర్వతం మీద ఏలీయాకు దేవుడిచ్చిన సమాధానమేంటో చూద్దాం రండి: “హజాయేలు యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని యెహూ హతముచేయును; యెహూ యొక్క ఖడ్గమును తప్పించుకొనువారిని ఎలీషా హతము చేయును” (1 రాజులు 19:17). యిలా మన పతనం ముందుకు సాగేకొలది హజాయేలు యెహూల కృత్యాలను చూస్తాము. వారి పని భౌతికపరమైంది కాని ఎలీషా పరిచర్య ముఖ్యంగా ఆత్మీయమైనది. అవినీతిని “అంతమొందించడానికి” ఏలీయా వాడిన మౌల్యమైన ఆయుధము, “రక్షణయను శిరస్త్రాణమును, దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గమును ధరించుకొనుడి, ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది” (ఎఫెసీయులకు 6:17; చూడు హెబ్రీయులకు 4:12). అవిధేయుల మీద దేవుని వాక్యము తీర్పును ప్రకటిస్తుంది.

ఏలీయా నాల్గవ ఫిర్యాదు చేశాడు: అతడొక్కడే మిగిలియున్నాడని, అందుకు దేవుడు, “బయలుకు మ్రొక్కని 7000 మంది యింకా ఇశ్రాయేలులో ఉన్నారని” రూఢి చేశాడు (1 రాజులు 19:18). ప్రభువు మాటలు ఏలీయాను అత్యానందభరితుణ్ణి చేశాయి. 19వ వచనం “అతడు అచటనుండిపోయి” అని తెల్పుచున్నది ఇంకను తిరిగి అతడు ఇశ్రాయేలులో దైవ జనునిగా నిలిచిపోయాడు సుమా!

**సవాలు – మరియు ప్రత్యుత్తరం**

ఏలీయా దేవుని చివరి ఆజ్ఞకు మొదటిగా విధేయత చూపించినాడు (16బి వచనం). అతడు ఉత్తరంగా 150 మైళ్ళు ప్రయాణం చేసి సారవంతమైన యొర్దాను లోయకు ఉత్తరంగా చివరనున్న ఆబేల్మెహోలా అనే పట్టణాన్ని చేరుకున్నాడు. “షాపాతు కుమారుడైన ఎలీషాను” కనుగొనేవరకు అంతావెదకినాడు (19బి వచనం). ఎలీషా బాల్య జీవితం గురించి మనకంతగా తెలియదు బహుశ బయలుకు మ్రొక్కని ఆ 7000 మందిలో ఈ కుటుంబం కూడ ఒకటైవుంటుంది. అతని తల్లిదండ్రులు అతనికి “ఎలీషా” అని నామకరణం చేశారు, దానికి అర్థమేమంటే, “నా దేవుడు రక్షణయైయున్నాడు” అని లేదా “నా దేవుడు రక్షిస్తాడు” అని.[2]

మొట్టమొదటిగా ఏలీయా ఎలీషాను చూచినప్పుడు అతడు పొలందున్నుచున్నాడు (19సి వచనం). మూడున్నర సంవత్సరాల కఠినమైన కరువు అప్పుడే ముగిసింది (1 రాజులు 17:1; 18:1, 2, 41–45; చూడు యాకోబు 5:17, 18), అంటే మూడు సంవత్సరాల తర్వాత అదే వారి మొదటి పంట అని చెప్పవచ్చు గదా! ఎలీషా “తన ముందరనున్న పండ్రెండు అరకల యెడ్లచేత దుక్కి దున్నించుచు పండ్రెండవ అరక తాను తోలుచుండెను” (1 రాజులు 19:19డి). యిక్కడ ఈ పదజాలం చూస్తే ఆంతర్యమేమి తెలియుచున్నదనగా ఎలీషా మిగతా పదకుండు అరకల పనివాళ్లను తనే పర్యవేక్షిస్తున్నట్టు, ఎలీషా కుటుంబం పండ్రెండు జతల ఎద్దులు కలిగియుండి వాటిని జీతగాళ్ళు ఉపయోగించి పనిచేయడం, చేయగలుచున్నారంటే యిక ఎలీషా వాళ్ళ కుటుంబం ఎంత భాగ్యవంతులో అర్థమవుతుంది.

త్వరలో జరుగనున్న “సమావేశం” “అసాధారణమైనది” వాస్తవానికి ఏలీయా ఎలీషాతో ఏం చెప్పలేదు. అతడు పని చేస్తున్న స్థలం దగ్గరవెళ్లి, “తన దుప్పటిని అతనిమీద వేశాడు”

అంతే (19ఇ). ఏలీయా యొక్క దుప్పటి బహు మొద్దు ముతక జంతు చర్మం, జంతు రోమాలు యింకా ఆయా వస్తువులతో చేయబడింది. 2 రాజులు 2:8లో సెప్టుజెంట్ (పాత నిబంధన గ్రీకు అనువాదం) దాన్ని "దుప్పటికి" బదులు "గొఱ్ఱెచర్మము" అని చెప్పబడింది. మోషే తన కర్రను ఎలా వాడినాడో ఏలీయా తన దుప్పటిని అలా వాడినాడు. యిక్కడ దుప్పటి ఏలీయా యొక్క "ఉద్యోగ ధర్మానికి గురుతుగావుంది." అంతేగాక అద్భుతాలు మహాత్కార్యాలు చేయడానికి ఒక సాధనంగావుంది.

యిక్కడ ఈ దృశ్యాన్ని ఊహించుకోండి: ఒకరోజు ఎలీషా పొలందున్నుతుంటే ఉన్నట్టుండి ఎక్కడనుండి ఊడిపడ్డాడో గాని ఒక అడవి మనిషిలా కనుపించే ఒక అజ్ఞాత మనుష్యుడు తారసిల్లాడు. ఆ వ్యక్తి ఒక్కసారి అతని కళ్ళల్లోకి చూచినాడు, తన మీద దుప్పటిని తీశాడు. అది అతను తన భుజాల చుట్టు చుట్టుకున్న ఒక ముతక మొద్దు దుప్పటి, అతని చెమటతో తడిసి ముద్దయింది, అతని ప్రయాణంలో మార్గంలో లేచిన దుమ్ముధూళితో బాగా మాసిపోయింది, రాత్రుల్లో కప్పుకొని పండుకోవడంవల్ల మరీ మురికిపట్టిన స్థితిలోవుంది. ఒక్కమాట కూడ మాట్లడకుండ అతడు ఆ దుప్పటిని తీసి ఎలీషా భూజాలమీద చుట్టేశాడు.

నేనుగనుకైతే ఈ అసాధాణమైన సంఘటనకు ఎలా స్పందించివుండేవాడినో నాకైతే తెలియదు. కానీ, ఎలీషా మాత్రం ఏదో ఒక విధంగా ఏలీయా చేసే పనియొక్క ప్రత్యేకత ఏంటో గమనించగల్గినాడు. ఈలాంటి దైవిక ఆంతర్య గ్రహింపును ఎలీషాకు దేవుడే ప్రసాదించాడు. ఏలీయా గురించి, ఏలీయా యొక్క అద్భుతమైన దుప్పటి గురించి స్వభావసిద్ధంగా ఏలీషా గ్రహించినట్టు కనబడుతుంది, ఈ చేష్టకు అర్థమేమో ఎరిగియుండవచ్చును. దానికి తోడుగా ఈ ముసలి ప్రవక్త యిలా అంటున్నాడు, "నన్ను వెంబడించు, యికనుండి నిన్ను నా యాజమాన్యంలోకి తీసుకొంటున్నాను చూచావుగా యిప్పుడు నీవు నా దుప్పటి క్రిందనేవున్నావు తదనంతరం నా స్థానంలో నీవు ఉండడానికి నేను నిన్ను తర్ఫీదు చేస్తాను" అంటున్నాడు.

ఏలీయా తన దుప్పటిని ఎలీషా మీదకు విసిరివేయగా ఎలీషా మార్గంలోనికివచ్చి ముందకు సాగినాడు. ఎలీషా ఎంత త్వరగా స్పందించాడో చూడగలం. తన జాతిని తినేస్తున్న ఆ ఆత్మీయ క్యాన్సర్ గురించి బహుశ అతని హృదయం కూడ దుఃఖంతో నిండియున్నది, "అతను ఎడ్లను విడచి ఏలీయా వెంట పరుగెత్తి" (20ఎ వచనం). యింకోవిధంగా చెప్పాలంటే, "నేను వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను, నాకు కొన్ని నిమిషాల టైంయిస్తే మా తల్లిదండ్రులకు వీడ్కోలు చెప్పివస్తానని" అంటున్నాడు.

ఆ మనవి చేసుకున్నందుకే ఎలీషా విమర్శించబడినాడు. అతడు ఎలాంటి శిష్యునితో పోల్చబడినాడంటే, "నాగటిమీద చేయి వేసి వెనుక తట్టు చూచువానిని పోలియున్నాడు" అని పోల్చినాడు (లూకా 9:61, 62). 1 రాజులు 19లో ఎలీషా మరియు లూకా 9లో కాబోవునట్టి మిషనరీల హృదయాలు దీంట్లో ఉన్నాయి. లూకా 9:57–62లోని వారు అన్ని సాకులే చెబుతున్నారు. ఎలీషా ఎలాంటి సాకు చెప్పుట లేదు; అతను దేవుని సేవలో ఏలీయాను అనుసరించడానికి తన జీవితాన్నే సమర్పించడానికి సంసిద్ధునిగా ఉన్నాడు.

ఏలీయా ప్రత్యుత్తరమిచ్చాడు, "పోయి రమ్ము, నావలన నీకు నిర్బంధము లేదని చెప్పెను" (1 రాజులు 19:20బి). ఈ మాటల్ని రకరకాలుగా వ్యాఖ్యానిస్తుంటారు. వాస్తవానికి యిక్కడ ఎలీషా అతని యింటికి వెళ్లి అతని తలిదండ్రులకు, బంధువర్గానికి, స్నేహితులకు వీడ్కోలు చెప్పి వెంటనే రావడానికి మాత్రమే ఏలీయా అనుమతి యిచ్చాడు. యిక్కడ "నావలన నీకు

నిర్బంధమేమి లేదుకదా?" అని చెప్పడంలో ఏలీయా ఆంతర్యమేమంటే, "నేను నిన్ను ప్రవక్తగా చేసినంతమాత్రాన నీవు నీ కుటుంబంతో పూర్తిగా తెగతెంపులు చేసుకొని రమ్మని కాదు. నీవు ఏంచేయబోవుచున్నావో వారికి వివరించి ఆ తర్వాత రమ్ము."

> అందుకతడు అతనిని విడిచి వెళ్లి కాడియెద్లను తీసి (వాటితో అతను పొలము దున్నుతుండెను) వధించి వాటిమాంసమును (బలిలో ఉపయోగించనివి) గొర్తినొగలచేత (ప్రానుతో చేయబడిన నాగలి మరియు కాడి) వంటచేసి జనులకు వడ్డించెను. వారు భోనముచేసిన తరువాత అతడు లేచి ఏలీయావెంబడి వెళ్లి అతనికి ఉపచారము చేయుచుండెను (21ఎ వచనం).

నేను ఉంటున్న ప్రాంతంలో, "ఎలీషా తనది అన్నది ఏదీ లేకుండ సమస్తాన్ని త్యజించి వచ్చాడు" అని మనం అనుకుంటాం. అతడు యిక ఒక వ్యవసాయదారుడుగా మాత్రం ఉండడు, ఆ చాప్టర్ క్లోజ్ అని మనం అంటాం. అతడు వీడ్కోలు విందు చేయడంతోడనే "అతడు లేచి ఏలీయాను వెంబడించాడు" (21బి వచనం).

యిక ఎలీషా దాదాపు పది సంవత్సరాలకు పైగా ఏలీయాతో ప్రయాణం చేశాడు, తన భవిష్యత్ సేవా కార్యక్రమం కోసం సంసిద్ధుడవుచున్నాడు. యిక 2 రాజులు 2వ అధ్యాయం వరకు ఎలీషా గురించి మనం చదవం, అయినప్పటికి లభ్యమైన కొన్ని వివరాలను బట్టి నేను నమ్మేదేమంటే ఎలీషా ఏది చెప్పియున్నాడో అది చేశాడు, అంటే "నిన్ను వెంబడిస్తాను" అన్నాడు అది చేశాడు (20 వచనం; 2 రాజులు 2:2 చూడు). మీరు 1 రాజులు 20–2 రాజులు 1, మీరు చదువుచున్నప్పుడు ఎలీషా ఏలీయాతో కలిసి పరిచర్యలోవున్నప్పుడు ఎలాంటి అనుభవాలు రుచిచూచాడో, ఎలాంటి దృశ్యాలు అతని కళ్ళముందు మెదిలాయో ఈ క్రింది విషయాల ద్వారా తెలుసుకోవచ్చు:

- నాబోతు ద్రాక్షాతోటలో ఏలీయా రాజైన అహాబును ఎదుర్కోవడం (1 రాజులు 21).
- రాజైన అహజ్యా పంపిన సైనిక ధళాన్ని ఏలీయా ఎదుర్కోవడం (2 రాజులు 1).

యిక్కడ ఎలీషా ఏలీయాతో ప్రయాణం చేసినప్పుడు అతని "సహ ప్రవక్తగా" గాని లేదా అతని "తర్వాత అధికారిగా" గాని ప్రయాణం చేయలేదన్న సంగతి దయచేసి గమనించవలసియున్నది. 1 రాజులు 19:21 చూచినట్లయితే ఎలీషా ఏలీయాకు "పరిచర్య" చేశాడనివున్నది. కాబట్టి కేవలం ఒక *సేవకునిగా* కలసి ప్రయాణం చేశాడు. అతడు ఏలీయాకు చేసిందేమిటి? ఏలీయా యొక్క అవసరతల విషయము శ్రద్ధ వహించాడు, *అవి ఏవైనా సరే.* 2 రాజులు 3:11లో చూచినట్లయితే ఎలీషా ఏలీయా చేతులమీద నీళ్ళు పోసేవాడని వున్నది. యిక అంతకంటె నీచమైన పనేమైనా ఉన్నదా.

ఆ పది సంవత్సరాలు ఎలీషా పనినేర్చుకోవడం లేక తర్ఫీదు పొందే విద్యార్థిగానే ఉన్నాడు. తర్వాత ప్రవక్తల కుమారులేమన్నారంటే, "ఏలీయా యొక్క ఆత్మ ఎలీషా మీద ఉందని" (2 రాజులు 2:15). ఏలీయా యొక్క దుప్పటి నేలనుండి తీసికొని యొర్దానును కొట్టిన అనుభవానికంటే ముందునుండి ఎలీషా ఏలీయా ఆత్మను గ్రాహ్యం చేసుకుంటునే

ఉన్నాడు. అతడు ఏలీయా ప్రవక్తతో ప్రయాణాలు చేసిన అనుభవంతో ఆయా చలి దీర్ఘ రాత్రుల్లో రాత్రంతా బైటగడిపిన అనుభవాల ద్వారా ఏలీయా యొక్క ఆత్మతో అనుభవంలో పాలుపంపులు కలిగియున్నాడు. అతడు ఆ దుమ్ము ధూళితో కూడిన ఉత్తర రాజ్యంగుండా ప్రయాణం చేసినప్పుడు అసలు ప్రవక్తగా ఉండటమంటే ఏంటో అనుభవ పూర్వకంగా గ్రహించాడు.

## దేవుడు అంగీకరించిన మనిషి (2 రాజులు 2:1-18)

### ఒక వృద్ధుడైన ప్రవక్త స్వగృహానికెళుతున్నాడు

ప్రభువు "సుడిగాలిచేత ఏలీయాను ఆకాశమునకు ఆరోహణము చేయింపబోవు కాలము" చివరకు ఆసన్నమైయింది (2 రాజులు 2:1ఎ). నిర్ణయించిన దినమందు, ఏలీయా గిల్గాలు నుండి బేతేలుకు, అక్కడనుండి యెరికోకు ప్రయాణం చేసాడు (1, 2, 4 వచనాలు). ఈ స్థావరాలన్ని యూదుల చరిత్రలో బాగా పేరుగాంచినవే అంతేగాని ప్రవక్త "వ్యూహాత్మకంగా" ప్రయాణంచేయలేదు. ఈ పట్టణాలన్నింటిలో ప్రవక్తల పాఠశాలలున్నవి (3, 5; 4:38 వచనాలు చూడు). ఏలీయా ఈ ప్రదేశాలన్ని దర్శిస్తున్నప్పుడు బహుశ ఆ విద్యార్థులందరిని దర్శిస్తూ వారివారి బాధ్యతల విషయం వారు అశ్రద్ధగా ఉండరాదని, ఎలాంటి కష్ట నష్టాలెదురైనా చివరివరకు నమ్మకంగా ఉండాలని వారికి హెచ్చరిక చేసియుంటాడు.

ఈ పాఠశాలల్లో ఉన్న వ్యక్తులను "ప్రవక్తల కుమారులు" అని అంటారు (2:3, 5, 7, 15). యిక్కడ "ప్రవక్తల కుమారులు" అంటే వారికి ప్రవక్తలైన తండ్రులున్నారని కాదు. యిక్కడ "కుమారులు" అంటే హెబ్రీ మూలార్థాన్ని బట్టి "వారిలక్షణాలలో పాలుపొంపులు గలవారని" అర్థము. ఈ వ్యక్తులంతా తర్ఫీదు పొందుచున్న విద్యార్థులు మాత్రమే. ఈ తర్ఫీదుకు సంబంధించిన పాఠ్య ప్రణాళిక ఏలీయా ప్రారంభించాడన్న నానుడి దైవ ప్రేరేపితం కాని సంప్రదాయమునుండి కలిగింది. తన సేవా కార్యక్రమమంతటిలో ఏలీయా ఈ పాఠశాలల పట్ల మంచి అనుభవం కలిగి దాన్ని కొనసాగించినాడు.

ఏలీయా చివరి దినాన, ఒక స్థలంనుండి మరొక స్థలానికి వెళుతున్నప్పుడు ప్రతి సారి ఎలీషాతో, "ఏలీయా – యెహోవా నన్ను బేతేలునకు పొమ్మని సెలవిచ్చియున్నాడు గనుక నీవు దయచేసి యిక్కడ నుండమని ఎలీషాతో అనెను. ఎలీషా – యెహోవా జీవముతోడు, నీ జీవముతోడు, నేను నిన్ను విడువనని చెప్పగా వారిద్దరును బేతేలునకు ప్రయాణము చేసిరి. పిమ్మట ఏలీయా – ఎలీషా, యెహోవా నన్ను యెరికోకు పొమ్మని సెలవిచ్చియున్నాడు గనుక నీవు దయచేసి యిక్కడ ఉండమని ఎలీషాతో అనగా అతడు యెహోవా జీవముతోడు నీ జీవముతోడు నేను నిన్ను విడువననెను గనుక వారిద్దరు యెరికోకు ప్రయాణము చేసిరి. అంతట ఏలీయా – యెహోవా నన్ను యొర్దానునకు పొమ్మని సెలవిచ్చి యున్నాడు గనుక నీవు దయచేసి యిక్కడ ఉండమని ఎలీషాతో అనగా అతడు – యెహోవా జీవముతోడు నీ జీవముతోడు నేను నిన్ను విడువనని చెప్పెను గనుక వారిద్దరును ప్రయాణమై సాగి వెళ్లిరి" (2, 4, 6 వచనాలు చూడు). బహుశ ఏలీయా ఒంటరిగా గడపవలెననుకొని ఉంటాడు, కాని అతని మాటలు మాత్రం కేవలం ఎలీషాను పరీక్షించడానికే అయ్యుండవచ్చు (రూతు 1:11-13 పోల్చు). యిక్కడ ఏలీయా ఎలీషాను మొదట్లో అతను సమర్పించుకున్న సమర్పణనుండి

కొంచెం ప్రక్కకు పెట్టడానికి, విరమించుకో అన్నంత పని బహు సున్నితంగా చేశాడు. బహుశ అతనితో యిలా అనివుండవచ్చు. "నీవు చేసిన తీర్మనాన్ని నీవు నమ్మకంగా కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నావా? అలా చేస్తే కష్టాలు ఎదుర్కోవాల్సివస్తుంది." ఏలీయాకు ఎలాంటి ఉద్దేశం ఉన్నా ఎలీషా మాత్రం తన సంకల్పంనుండి తననెవరూ దారిమళ్ళించడానికి యిష్టంగా లేడు. అందుకే ప్రతి సారి అతను యిలా ప్రత్యుత్తరమిచ్చాడు, "**యెహోవా** జీవముతోడు నీ జీవముతోడు నేను నిన్ను విడువనని చెప్పెను" (2 రాజులు 2:2, 4, 6).

ఆఖరిగా, దేవుడు ఏలీయాను యొర్దాను నది వద్దకు నడిపించాడు (6, 7 వచనాలు). ఏభైమంది ప్రవక్తల కుమారులు ఏలీయా ఎలీషాలను దూరంనుంచి గమనించారు (7 వచనం). "ఏలీయా తన దుప్పటిని తీసుకొని చుట్టి నీటిమీద కొట్టినాడు" (8ఎ వచనం) – మోషే గనుక ఎర్రసముద్రం మీద తన కఱ్ఱను చాపినట్టుగా అది ఉంది (నిర్గమకాండము 14:16, 21). వెంటనే, నీరు "రెండు పాయలుగా చీలి మార్గమేర్పడినప్పుడు యిద్దరూ ఆరిన నేలను నడిచినారు" (2 రాజులు 2:8బి) – పూర్వం గనుక యెహోషువ మరియు అతని సేనలు యొర్దానును దాటిపోయిన రీతిగా ఉంది (యెహోషువ 3:14–17).

వారు ఆ నదికి తూర్పు దిక్కుగా వెళ్ళినప్పుడు ఏలీయా ఎలీషాతో అన్నాడు, "నేను నీయొద్దనుండి తీయబడక మునుపు నీకొరకు నేనేమి చేయ కోరుదువో దాని నడుగుమని" చెప్పెను (2 రాజులు 2:9ఎ). ఎలీషా అనేక విషయాలు అడిగియుండవచ్చు, అన్నిటికంటె కూడ, "నీ యొక్క రెండంతల ఆత్మ నా మీదనుండనిమ్ము" (9బి) అనడం ఎలీషా ధైర్యంగల విశ్వాసము, నిస్సంకోచమైన విధేయత, నిష్పక్షపాతమైన న్యాయము, తన దేవుని యెడల నిష్కల్మషమైన దైవభక్తి – తర్వాత ఫలితాలు ఏమైనాసరే. ఎలీషా లెక్క చేయలేదుగాని, "రెండంతల ఆత్మ కావాలని" కోరినాడు.

యిక్కడ "రెండింతల" అనే పదం కొంత అలజడి కలిగించేదిగా ఉండొచ్చు. తన గురువుకంటె రెండంతల మంచివానిగా కాని శక్తి సామర్థ్యాలుగల వానిగావుండాలని గాని ఏలీయా అడుగుచున్నట్టు ఎలాంటి నిదర్శనం లేదు. బహుశ అతడు ఏలీయాకు ఒక ఆత్మీయ వారసునిగా ఉండాలని మాత్రమే కోరుకొన్నాడని అర్థమవుతుంది. యూదుల ధర్మశాస్త్రం ప్రకారం, పెద్ద కుమారుని "ఆస్తిలో రెండు భాగాలు" (ద్వితీయోపదేశకాండము 21:17). ఆ కుమారుడు తన తండ్రి తదనంతరం తండ్రి పేరు నిలబెట్టుట మాత్రమే గాక అతని పనిని కొనసాగిస్తాడు.

"నీవు అడిగినది కష్టతరముగానున్నది" (2 రాజులు 2:10బి) అని ఏలీయా ప్రత్యుత్తరమిచ్చాడు. అతను అడిగిందేమంటే "నేను నీకేమి చేయగోరుచున్నావో" దాన్ని అడగమని. ఎలీషా మాత్రం జ్యోతీర్మయుడగు దేవునినుండి ప్రసాదింపబడేదే అడిగినాడు. ఎలాగైతేనేం ఎలీషా యొక్క మనవి అంగీకరించబడుతుందిగాని, ఒక షరతుమీద మాత్రమే. ఏలీయా అన్నాడు, "నీ యొద్దనుండి నేను తీయబడినప్పుడు నేను నీకు కనబడినయెడల; ఆ ప్రకారమే నీకు లభించును" (10బి వచనం). యిప్పటికి పదేళ్లక్రితమే, ఏలీయా స్థానంలో ఎలీషాను దేవుడు ఏర్పాటుచేసుకున్నాడు (1 రాజులు 19:16). ఎలీషా గనుక ఏలీయాను వెంబడించుటకు చేసిన తీర్మానాన్ని గట్టిగా నిలుపుకోగల్గినట్టయితే అది నిరాటంకంగా కొనసాగగలదు (20, 21 వచనాలు). అతడు అతనితో చివరిదాకావుండాలి.

ఏలీయా ఎలీషాలు యొర్దానునుండి తూర్పువైపుకు ప్రయాణం చేశారు. అంతలో

అకస్మాత్తుగా "అగ్ని రథములు అగ్ని గుఱ్ఱములు కనిపించాయి" (2 రాజులు 2:11ఏ). ఆకాశ సైన్య సమూహాలను గూర్చి వివరించడం ఇదొక విధానం (2 రాజులు 6:17; కీర్తనలు 104:4 చూడు). ఏలీయాను ఇంటికి తీసుకెళడానికి దూతలు వచ్చారు (లూకా 16:22 చూడు)! రథమును గుఱ్ఱములును యిద్దరిని వేరుచేశాయి (2 రాజులు 2:11బి). పెద్ద సుడిగాలి వచ్చింది దాంతో పాటు దుమ్ముధూళి అంతెత్తున లేచింది – అయినప్పటికి దానిగుండా తన యజమానుని ఎలీషా చూడగల్గినాడు (12ఏ వచనం). తరువాత ఏలీయా సుడిగాలిలో ఆకాశంలోకి వెళ్ళి పోయాడు (11సి వచనం).

"నా తండ్రీ, నా తండ్రీ ఇశ్రాయేలువారికి రథమును రౌతులును నీవే గదా!" అంటు ఎలీషా కేకలు వేశాడు (12బి వచనం). ఈ మాటలు, పరలోక సైన్య సమూహాలకు వర్తింపవు గాని ఏలీయాకు మాత్రమే వర్తిస్తాయి (2 రాజులు 13:14ఏ తో పోల్చి చూడు). ఏలీయా దేవుని యొక్క ఒక్క వ్యక్తి సైన్యం, "ఇశ్రాయేలు తన మిలిటరీ బలాన్ని గురించి అతిశయించేకంటే కూడ ఎక్కువైనవాడు."[3]

అప్పుడు ఎలీషా తన వస్త్రమును పట్టుకొని రెండు తునకలు చేసెను, ఇది అతని విచారానికి సూచనగా ఉంది (2:12డి; ఆదికాండము 37:29; 2 సమూయేలు 13:19; యోబు 1:20; 2:12 చూడు). తన ఆత్మీయ తండ్రిని ఎవరో ఎత్తుకెళ్ళేసరికి, పట్టరాని దుఃఖంతో పసిపిల్లవానిలా బావురుమన్నాడు. అంతేకాదు ఇశ్రాయేలు వారి రథాలు గుఱ్ఱాలు మాయమైపోయేసరికి కలతో నిండిన ఒక దేశభక్తునిలా బాధతో దుఃఖించాడు.[4]

### ఒక క్రొత్త ప్రవక్త పనిలో ప్రవేశిస్తున్నాడు

ఏలీయా ఎక్కడనుండి ఎత్తబడినాడో ఆ స్థానాన్ని చూచాడు ఎలీషా. ఆ ప్రవక్త దుప్పటి నేలమీద పడివుంది. ఏలీయాకు సంబంధించినదంతా కొనిపోబడిందిగాని ఆ ఒక్క దుప్పటి మాత్రం మిగిలిపోయింది. ఆ దుప్పటిని తీసుకొని ఎలీషా యొర్దాను వద్దకు వచ్చాడు (2 రాజులు 2:13). ఏలీయా యొక్క ఆఖరి అద్భుతం యితనికి మొదటి అనుభవంగా సంప్రాప్తించింది.

ఆ మురికి కాలువ దగ్గరకొచ్చినప్పుడు, అతడు ఆ దుప్పటిని మడతపెట్టి నీటిమీద కొడుతూ[5] "ఏలీయా యొక్క దేవుడైన యెహోవా ఎక్కడవున్నాడు?" అని బిగ్గరగా కేకవేశాడు (14ఏ వచనం). ఎలీషా దేవునియొక్క ఉనికిని శంకించడం లేదు. కాని, "**ప్రభువా** నీ విక్కడవున్నావా? నేను రెండింతలు పొందినానా, లేదా? ఏలీయాకు పాయలైన నీరు, నా మాటలకు కూడ పాయలవుతాయా?" అని అడుగుచున్నాడు.

ఔను అలానే జరిగింది! "అతడు ఆ దుప్పటితో నీటిని కొట్టగా అది ఇటు అటు విడి పోయినందున ఎలీషా అవతలి యొడ్డునకు నడిచిపోయెను" (14బి వచనం). దేవుడెప్పుడు సిద్ధంగా సర్వశక్తిమంతుడై యుంటాడు. ఆ దేవుడే ఈ రోజు ఎలీషాతో పని చేస్తున్నాడు దేవుని యొక్క గొప్ప వీరుడు మరణించాడు అనగానే దేవుడు కూడ ఆ సేవకునివలెనే మరణించియున్నాడనడానికి వీలులేదు. ఆ దుప్పటిని ఎత్తుకొని ముందుకు సాగే ఏ పురుషులు ఏ స్త్రీలువున్నా దేవుడు తన కార్యాలను నిర్వహిస్తూనే యుంటాడు కదా!

ప్రవక్తల కుమారులు చూస్తూనేయున్నారు (7 వచనం). అసలేం జరిగిందో అన్న విషయం వారికేమి అర్థం కాలేదు. ఏదైతేనేం, వారు స్పష్టంగా చూడగలిగిందేమంటే ఏలీయా తూర్పుగా

వెళ్ళినప్పుడు అతనికి యొర్దాను అటు యిటు విడిపోయి దారియివ్వడం, యిప్పుడు ఎలీషా పశ్చిమంగా వెళుతుంటే ఇటు అటు విడిపోవడం, దారియివ్వడం చూచారు. వాళ్ళంతా, "ఏలీయా ఆత్మ ఎలీషా మీద నిలిచియున్నది" అన్న తీర్మానానికి వచ్చినారు (15ఎ వచనం). ఏలీయా తదనంతరమైన పరిచర్యకు దైవిక నిర్ణయం ద్వారా ఏర్పాటు చేయబడినవాడు ఎలీషా. వాళ్ళంతా పరుగెత్తుకుంటూ వచ్చి తమ క్రొత్త నాయకునికి సాష్టాంగ నమస్కారం చేశారు (15బి వచనం).

ఏలీయాకు ఏమైందో అన్న విషయం గురించి వారింకా కలవరపడుతునేవున్నారు. ప్రభువు యొక్క ఆత్మ ద్వారా యిక్కడనుండి మరోచోటికి అక్కడక్కడకు అద్భుతంగా కొనిపోబడే ప్రవక్త అని ఏలీయాకు గొప్ప పేరు ప్రతిష్టలున్నాయి (1 రాజులు 18:12ను; అపొస్తలుల కార్యములు 8:39, 40తో పోల్చి చూడు). వారు ఎలీషాతో ఏమన్నారంటే, "ఇదిగో నీ దాసులమైన మా యొద్ద ఏబదిమంది బలముగలవారున్నారు; మా మీద దయయుంచి నీ గురువును వెదకుటకు వారిని పోనిమ్ము; యెహోవా ఆత్మ అతనిని ఎత్తి యొక పర్వతము మీదనైనను లోయయందైనను వేసి యుండునేమో అని మనవి చేసిరి" (2 రాజులు 2:16ఎ). ఏలీయా కోసం వెదకడం వృథా ప్రయాస అని ఎలీషాకు బాగా తెలుసు. మొదట్లో వద్దన్నాడు (16బి వచనం) కాని అతడు ఒప్పుకునేవరకు అతన్ని వారు బలవంతం చేశారు (17ఎ వచనం). "అతన్ని బాగా విసిగించారు" అని మనం అనుకోవచ్చు.

వాళ్ళు మూడు రోజులుదాకా వెతికారు, గాలించారు (17బి వచనం). వారు యెరికోకు తిరిగి వచ్చినప్పుడు వారితో "నేను మీకు వెళ్ళొద్దని చెప్పలేదా?" (18 వచనం). అతడు వారిని మందలించినదాంట్లో "నేను మీకు అదే చెప్పాను గదా" అనే మాటలు కొట్టొచ్చి నట్లు కనిపిస్తాయి. అంటే దాని ఆంతర్యమేమంటే, "నన్ను గనుక మీరు మీ నాయకునిగా అంగీకరించినట్టయితే నా మాటలు మీరు వినాలిగదా!" ఈ అవసాన కాలంలో ఎలీషా యెహోవా యొక్క అధికార ప్రతినిధిగా నిలిచాడు.

## దేవునికి కావలసిన మనిషి

### బాహ్యపరమైన వ్యత్యాసాలు

తర్వాత పాఠంలో, ఎలీషా యొక్క సేవ పరిచర్య గురించి పఠనం ప్రారంభిస్తున్నాము. ఈ అంశాన్ని ముందుంచక ముందు, ఎలాగైనా, ఎలీషా అతని ముందు వారికి గల తారతమ్యాలు చూడాలనుకుంటున్నాను. యిద్దరు మనుష్యుల మధ్య అనేక వేరువేరు వ్యక్తిత్వాలు గమనించడం కష్టమైన విషయమే:

- ఏలీయా ఒక ఎడారి శిశువు, రోమాల దుస్తులు ధరించాడు. ఎలీషా పొలందున్నుకునేవాడు; సామాన్య వస్త్రాలు ధరించాడు.[6]
- ఏలీయా ఒక సన్యాసి; అతన్ని కనుగోవడం కూడ కష్టమే. ఎలీషా అందరితో కలిసివుండే సాంఘిక జీవి; ఎవరైనా అతన్ని వెళ్ళి కలవాలంటే అవసరమైనప్పుడెప్పుడైనా దర్శించవచ్చు.
- ఏలీయా (ఆనాటి రాజకీయ సాంఘిక కట్టుబాట్లకు దూరంగా) "తన స్వేచ్ఛా ప్రపంచంలో పని కలిగియున్నాడు." ఎలీషా "తన పరిధిలో తన పని

చేస్తున్నాడు."

- ఏలీయా దేవుని న్యాయానికి ప్రతీకగా నిలిచాడు, ఎలీషా దేవుని కరుణ కటాక్షాలకు ప్రతీకగా నిలిచాడు. ఏలీయా విధానమంతా ఉరుములు, మెరుపులు. ఎలీషాకు సాధుత్వం నెమ్మది, వర్షాభావం, ఏలీయాది కళ్ళు జిగేల్‌మనే అంధత్వాన్ని కలుగజేసేటంత తెల్లటి తెలుపు. ఎలీషాది నింపాదిగా వెలిగే చలించని చిరుదివ్వె. ఒక యుద్ధ వీరుడు ఝుళిపంచే ఖడ్గంలాంటివాడు ఏలీయా; ఎలీషా ఒక నైపుణ్యంగల శస్త్ర వైద్యుని చేతిలోని కత్తిలాంటివాడు.

పరస్పర విరుద్ధమైన వ్యక్తిత్వాలుగల ఈ యిద్దరు ప్రవక్తలనుబట్టి *దేవుడు అన్ని రకాల ప్రజలను వాడుకోగలడన్న* వివరణ మనకు లభిస్తుంది. అతని తరానికోసం పని చేయడానికి దేవునికి కావలసిన వ్యక్తి ఏలీయా; అతని కాలంలో పనిచేయడానికి దేవునికి కావలసిన వ్యక్తి ఎలీషా. మనం దేవుని సేవకుల గురించి వివరించుకొనేటప్పుడు ఈ రోజుల్లో యిదే మనం గుర్తుంచుకోవాలి. ఆ కాలంనాటి మండుచున్న బోధకులు యిప్పటికి కావాలని కొందరు కోరుకుంటారు. మంచిదే వారి యిష్టాన్ని కాదని మనం ఎందుకనాలి కాని "మృదువైన మాటలతో క్రోదమును చల్లార్చే" వ్యక్తులు కూడ ఈ రోజు మనకు కావాలి (సామెతలు 15:1 చూడు). రక్షించుటకైన దేవుని శక్తి గొప్ప ధ్వనిలో లేదు ఆరోగ్యకరమైన మంచి ఉపదేశములో ఉంది (దేవుని వాక్యం పట్ల నమ్మకంగా ఉండాలి) (తీతు 2:1, 8; రోమీయులకు 1:16 చూడు).

దేవుని సేవలో మన శక్తి సామర్థ్యాలను బేరీజు వేసుకొని చూచుకునేటప్పుడు సత్యాన్ని మనం బాగా ఆలోచించాలి. మనం ఎదుటి వ్యక్తిలాంటి వ్యక్తిత్వంగల వాళ్ళం కాదని దేవుని హస్తాల్లో మనం వాడబడే విషయమును గురించి తక్కువ చూపు చూడ కూడదు. యితరులకున్న వరాలు వ్యక్తిత్వం మనకుండకపోవచ్చు కాని మనకున్న సామర్థ్యాన్ని సమర్పించుకోవచ్చు. కాని *ఎవ్వరైతే* ఆయన చిత్తాన్ని చేయడానికి వారి వారి జీవితాలను సమర్పించుకుంటారో ప్రభువు ఖచ్చితంగా వాడుకుంటాడు అనే సత్యాన్ని మనం గ్రహించడం మంచిది.

**ప్రాముఖ్యమైన పోలికలు**

ఏలీయాకు ఎలీషాకు, మధ్యనున్న తారతమ్యాలను యింతవరకు చూచాం. కాని ఆ పోలికలు పైపైకి మాత్రమే. దీంట్లో ముఖ్యమైన విషయమేమంటే, దేవుని సేవకోసమైన ప్రగాఢమైన సమర్పణలో వారిద్దరు సమానమైన పోలిక లేక స్వభావం కలిగియున్నారన్నదే. అతని కాలానికి దేవునికి కావలసిన మనిషి యొక్క లక్షణాలు ఎలావుంటాయో చూద్దాం:

- అతనికి దేవునిపట్ల ప్రగాఢమైన విశ్వాసమున్నది.
- అతడు భక్తిగల దైవ జనుడు (2 రాజులు 4:9).
- దేవుని చిత్తాన్ని నెరవేర్చడానికి ఎంతో ఆశగలవాడు (1 రాజులు 19:19, 20).
- గత జీవితంతో తెగతెంపులు చేసుకున్నాడు (1 రాజులు 19:21).
- అతడు పరిచర్యకు సిద్ధంగా ఉన్నాడు (2 రాజులు 3:11).
- పది సంవత్సరాల పాటు సేవార్థమై తర్ఫీదు పొందుతు సిద్ధపడుతున్నప్పుడు

మధ్యలో మానుకోలేదు (కొంతమంది అప్పుడప్పుడే ప్రతిఫలాలు కోరుకుంటారు, అప్పుడప్పుడే లాభాలు రావాలని, వెంటనే విజయాన్ని వరించాలని కోరు కుంటారు).

- అతడు ఏలీయాని వెంబడిస్తాను అని చెప్పినాడు, ఆ సమర్పణకు నమ్మకంగా కట్టుబడియున్నాడు. మధ్యలో అతన్ని దారిమళ్ళించడానికి ప్రయత్నాలు జరిగినా, చివరివరకు వెంబడించడంలో తన ప్రయత్నాలనుండి తొలగిపోలేదు (2 రాజులు 2:2, 4, 6, 10–12).
- అతను తీసుకొంటున్న బాధ్యత ఎంత భారభరితమైనదని అతనికి తెలిసినప్పటికి ఆ బాధతోనే తను కావాలని యిష్టంగా స్వీకరించాడు. విపరీతమైన విగ్రహారాధనలో మునిగిపోయిన సమాజంలో యెహోవా యొక్క ప్రతినిధిగా ఉండడమంటే అతనేం పేరు సంపాదించుకోగలడు (2 రాజులు 2:23 చూడు). అయినప్పటికి దేవుడు తన ముందుంచిన బాధ్యతను స్వీకరించినాడు (1 రాజులు 19:16; 2 రాజులు 2:9 చూడు).

మనమింకా కొన్ని లక్షణాలను యిక్కడ చేర్చవచ్చు. ఉదాహరణకు ఎలీషా ప్రజల పట్ల ఆసక్తిగలవాడు, అన్ని రకాల ప్రజలు వారు గొప్పవారే గాని, సామాన్య ప్రజలే గాని ఫరవాలేదు. అయినప్పటికి యింతవరకు యిచ్చిన ఏలీయా లక్షణాల పట్టి సరిపోతాయి. మరొక్కసారి ఒక విషయాన్ని నొక్కి వక్కాణించాలనుకుంటున్నాను. అదేమంటే, దేవుడు నీ వ్యక్తిత్వం ఎలాంటిదయినా, నీకున్న వరాలు ఎలాంటివైనా సరే నీవు గనుక నీ జీవితాన్ని ఆయనకు సమర్పించుకున్నట్టయితే దేవుడు నిన్ను తన సేవకోసం వాడుకుంటాడు.

**ముగింపు**

సహజంగా మనం ఒక మాట అంటుంటాం, "ఒకరిని వెంబడించడమనేది చాలా కష్టతరమైన విషయం" అని. యిలా చెప్పడం ఎలా ఉందంటే, నృత్యసంగీతమయ ప్రహసన కాలంలో రంగస్థల నాటకాలు ఒక అంకం తర్వాత మరో అంకం చూపించినట్టు ఉంటున్నది. మొదటి అంకంలో పాత్రధారుడు గనుక తన నటనతో ప్రేక్షకులను వుర్రూతలూగించినట్లయితే యిక రెండవ అంకం ప్రదర్శక పాత్రధారుడు తనకంటె ముందు వానిలా తాను చేయగలనా అని అంచనా వేసుకోవలసివస్తుంది. సంఘమంతా అభిమానించి ప్రేమించిన బోధకుడు సంఘాన్ని విడిచి మరో స్థలానికెళ్ళినప్పుడు అతని తదనంతరం వచ్చే బోధకుడు "ఆ పనికొనసాగించడం, ఎంతకష్టతరమైన పనో" అన్న విషయం గ్రహిస్తాడు.

మరి ఏలీయాను "అనుసరించడం అంతమామూలు విషయమా." ఏలీయా ఏదిచేసిన మహా గొప్పగా కళ్ళకు కట్టినట్టుగా వేడుకగా ప్రదర్శించాడు. యూదా జనాంగానికతడొక గొప్ప కథానాయకుడైనాడు. మెస్సీయా కంటే ముందు అతను రావాలని వారు నిరీక్షించారు (మత్తయి 17:10 చూడు). అతడు మోషేతో క్రీస్తుతో కూడ ఆ రూపాంతరపు కొండమీద నిలిచాడు (మత్తయి 17:3).

"అనుసరించడం కష్టతరమైనప్పుడు" నీవేమిచేస్తావు? నీవు ఏదో చేయగల్గింది చేస్తావు, నీకు దేవుడిచ్చిన వరాలను వాడతావు, ఇంకా చేయగల్లిందంతా చేస్తావు. అదే ఎలీషా చేసింది

కూడ. అతడు యిట్టే తేలిపోయే ఏలీయా రూపం కాదు. లేదా తన గురువుయొక్క నీడ కాదు, ప్రతిధ్వని కాదు. అతనేమైయున్నాడో చూపించాడు అంతే. అతని కాలానికి దేవునికి కావలసినవాడతడే, కష్ట కాలానికి దేవుని మనిషి – అతడు తన పనిని నెరవేర్చాడు. దేవుడు ఎవరిని కూడ వారికి మించింది చేయమని కోరడు.

---

సూచనలు

[1]Joseph Hammond, “1 Kings,” *The Pulpit Commentary,* vol. 5, *1 & 2 Kings,* ed. H. D. M. Spence and Joseph S. Excell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 463. [2]ఇంకా ఆయా అంశాలు కూడ వాడుకోవచ్చని సలహా యివ్వబడింది. ఉదాహరణకు, “దేవుడు రక్షణ” లేదా “దేవుడు రక్షిస్తాడు” అని. ఎలీషా గురించి యింకో విషయంకూడ మనం తెలుసుకోవచ్చు: ఏలీయావలె ఎలీషా కూడ వివాహం చేసుకోలేదని. [3]Donald J. Wiseman, *1 and 2 Kings: An Introduction and Commentary,* Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1993), 196. [4]Henry Blunt, *Lectures on the History of Elisha* (Philadelphia: Herman Hooker, 1839), 31. [5]ఏలీయా దుప్పటి గురించి బహుశ మనం ఆఖరి సారిగా చదువుచున్నాము. తర్వాత ఎలీషా దీన్నెప్పుడైనా వాడినాడా అన్న సంగతి గురించిన వివరణ ఎక్కడా కనిపించదు. ఏదైతేనేం ఆ దుప్పటి ఉపయోగపడేంతవరకు ఉపయోగపడింది చాలు. [6]2 రాజులు 2:12లో ఈ హెబ్రీ పదం “దుస్తులు” అని అర్థంతో వాడబడింది.